క్లుప్తంగా

20న సంగీత మహోత్సవం

విజయవాడకల్చరల్: శ్రీసుబ్రహ్మణ్య మహతీ సంగీత సమితి ఆధ్వర్యంలో ఈ నెల 20వ తేదీ శనివారం దుర్గాపురంలోని సంస్థ కార్యాలయంలో సంగీత మహోత్సవం నిర్వహిస్తున్నట్లు సమితి కార్యదర్శి సీవీ రావ్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో భాగంగా విఖ్యాత యువ సంగీత కళాకారిణి చారుగండ్ల శ్రావణి వేణుగాన కచేరీ, జొన్నలగడ్డ సాయి శ్రావణి కర్నాటక సంగీత కచేరీ నిర్వహిస్తారన్నారు. సంగీత విద్వాంసుడు మోదుమూడి సుధాకర్, శ్రీ సుబ్రహ్మణ్య సంగీత సమితి అధ్యక్షుడు డాక్టర్ మన్నెం గోపీచంద్ తదితరులు పాల్గొంటారని చెప్పారు.

నగరంలో భారీ వర్షం



మధురానగర్(విజయవాడసెంట్రల్): నగరంలో బుధవారం సాయంత్రం ఒక్కసారిగా భారీ వర్షం కురిసింది. సాయంత్రం 6 గంటల సమయంలో ఒక్కసారిగా దట్టమైన మేఘాలు అలుముకుని భారీ వర్షం పడింది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. బీఆర్టీఎస్ రోడ్డు, సత్యనారాయణపురం రాజేశ్వరి వీధి, ఏలూరు రోడ్డు, బావాజీ పేట ప్రాంతాల్లో రోడ్లపై వర్షపునీరు నిలిచిపోయింది. శివారు కాలనీలు బురదగా మారటంతో రాకపోకలకు వాహన చోదకులు అవస్థలు పడ్డారు.

వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటించాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్): నగర ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని కార్పొరేటర్ చన్నగిరి రామ్మోహన్‌రావు సూచించారు. అయోధ్యనగర్‌లో బుధవారం స్వచ్ఛత సేవ అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని అవగాహన ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన పరిసరాల పరిశుభ్రత పాటించాల్సిన ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో పారిశుద్ధ్య సిబ్బంది, వార్డు సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

అంతరిక్ష యానం వైపు లయోలా పూర్వ విద్యార్థి

లబ్బీపేట(విజయవాడతూర్పు): అంతరిక్షంలో జీవితాన్ని గడపడానికి ముందుకు సాగుతున్న ఆంధ్రా లయోలా కళాశాల పూర్వ విద్యార్థిని ఆనీ సత్తెనపల్లి మనందరికీ గర్వకారణమని పలువురు పేర్కొన్నారు. కళాశాల భౌతికశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన సదస్సులో ఆనీ అతిథి ఉపన్యాసం చేశారు. ఆమెను కళాశాల యాజమాన్యం సత్కరించింది. భౌతికశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ తుమ్మల శ్రీకుమార్ మాట్లాడుతూ ఖగోళ భౌతికశాస్త్ర పరిశోధనలో, విదేశాల్లో ఖగోళ జీవశాస్త్రంలో అధ్యయనాల వైపు అడుగులు వేస్తున్నట్లు తెలిపారు. ఐఐటీ ఇండోర్ నుంచి మాస్టర్స్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన ఆనీ ఆస్ట్రేలియాలోని కర్టిన్ విశ్వ విద్యాలయంతో కలిసి యూజీమార్ట్, ఎండబ్ల్యూఏ వంటి అత్యాధునిక టెలిస్కోప్‌లను ఉపయోగించి పల్సర్‌లపై విస్తృతంగా పనిచేశారన్నారు. ఆమె పరిశోధన ఇప్పుడు యూకేలోని ఎడిన్‌బర్గ్ విశ్వ విద్యాలయంలో ఆస్ట్రోబయాలజీ వైపు ఉత్తేజకరమైన మలుపు తీసుకున్నట్లు తెలిపారు. ఐఏ పీటీ ఏపీ చాప్టర్ అధ్యక్షుడు డాక్టర్ జి.సహాయ భాస్కరన్, డాక్టర్ పీవీఎస్ సాయిరాం, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ ఫాదర్ వైటి ప్రభులు ఆమె సాధించిన విజయాలను ప్రశంసించారు.

బాలుడి అదృశ్యంపై ఫిర్యాదు

పటమట(విజయవాడతూర్పు): బాలుడు అదృశ్యంపై పటమట పోలీసుస్టేషన్‌లో బుధవారం కేసు నమోదైంది. కరెన్సీనగర్ వద్ద ఉన్న రామచంద్రనగర్‌లో నివాసం ఉంటున్న తురక అంజమ్మ రోజువారీ పనులకు వెళ్తుంది. భర్తతో మనస్పర్థలతో తన ఇద్దరు కూతుళ్లు, కొడుకుతో కలిసి 10 ఏళ్లుగా జీవిస్తుంది. అంజమ్మ కొడుకు తురక విజయ్‌కుమార(14) రామవరప్పాడులోని జెడ్పీ హైస్కూల్లో 8వ తరగతి చదువుతున్నాడు. 10 రోజులుగా తన కుమారుడికి ఆరోగ్యం బాగాలేకపోవటంతో ఇంటివద్దే ఉంటున్నాడని, రోజు మాదిరే బుధవారం తన పని ముగించుకుని ఇంటికి రాగా తన కుమారుడు కన్పించకుండా పోయాడని పటమట పోలీసులకు ఫిర్యాదు చేసింది. పటమట పోలీసులు కేసు నమోదు చేశారు.

అధ్వానంగా కండ్రిక రోడ్డు

- భారీ వాహనాల రాకపోకలతో గుంతలమయంగా రోడ్డు
- గుంతలతో దెబ్బతింటున్న వాహనాలు
- రోడ్డుకు మరమ్మతులు చేయాలని వినతి
- పట్టించుకోని అధికారులు



రోడ్డుపై ఏర్పడిన గుంత

పాయకాపురం(విజయవాడరూరల్): గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో విలేజి కండ్రిక ప్రజల రాకపోకల కోసం నిర్మించిన కండ్రిక – పాతపాడు రోడ్డు ప్రధాన రహదారిగా మార్పు చెంది భారీ వాహనాల రాకపోకలతో రద్దీ పెరిగి అధ్వానంగా మారింది. మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు విలేజి కండ్రిక ప్రజల విజ్ఞప్తి మేరకు డిస్ట్రిక్ట్ మైనింగ్ గ్రాంట్ మూడు కోట్ల 40 లక్షల రూపాయలను మంజూరు చేయించి కండ్రిక కట్ట నుంచి విలేజి కండ్రిక వరకు 2024వ సంవత్సరంలో తారు రోడ్డును నిర్మించారు. అప్పటి నుంచి కొండపల్లి, జి.కొండూరు, వెలగలేరు ఆ పై ప్రాంతాల నుంచి దాదాపు 35 నుంచి 40 టన్నుల కంకర, ఇసుక, రబ్బీష్ లారీలతో పాటు పినపాక నుంచి విజయవాడ తదితర ప్రాంతాలకు వెళ్లే భారీ ఆయిల్ ట్యాంకర్లు ఈ రోడ్డు నుంచి రాకపోకలు సాగించడంతో రోడ్డుపై భారీ గుంతలు పడ్డాయి.

అధికారుల దృష్టికి తీసుకెళ్లినా..

కొన్ని చోట్ల రోడ్డుకు మధ్య మధ్యలో పగిలిపోయి ఒకవైపు నుంచే వాహనాలు నడుస్తున్నాయి. ప్రమాదకరంగా మారిన ఆ రోడ్డు పై నడవాలంటే ప్రజలు భయపడుతున్నారు. అంతేకాక ద్విచక్ర వాహనదారులు, ఆటోలు రోడ్డు సరిగా లేకపోవడంతో తరుచూగా ప్రమాదాలకు గురికావడంతో పాటు వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుకు మరమ్మతులు చేయాలని స్థానిక కార్పొరేటర్ యర్రగొర్ల తిరుపతమ్మ వీఎంసీ కౌన్సిల్ సమావేశాల్లో అధికారుల దృష్టికి తీసుకెళ్లినా రోడ్డు మరమ్మతులకు నోచుకోలేదు. అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. వెస్ట్ బైపాస్ రోడ్డు నుంచి వచ్చే వాహనాలు ఇదే రహదారిలో రాకపోకలు సాగించడంతో ట్రాఫిక్ రద్దీ కూడా విపరీతంగా పెరిగింది. ప్రధాన రహదారి మాదిరిగా వాహనాల సంఖ్య ఉండటంతో రోడ్డును అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు. మాస్టర్ ప్లాన్‌లో 80 అడుగుల రోడ్డుగా ఈ రహదారి ఉన్నందున రాష్ట్ర ప్రభుత్వం రోడ్డు అభివృద్ధికి అవసరమైన నిధులను మంజూరు చేసి రోడ్డుకు మరమ్మతులు చేయాలని కండ్రిక, పాతపాడు, పరిసర గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



రోడ్డుపై ఏర్పడిన గుంత



కండ్రిక రోడ్డులో రాకపోకలు సాగిస్తున్న భారీ వాహనాలు

రద్దీ పెరగడంతో ప్రమాదాలు..



కండ్రిక రోడ్డులో రాత్రింబవళ్లు భారీవాహనాల రాకపోకలు సాగించడంతో రద్దీ పెరిగింది. రోడ్డుపై భారీ గుంతలు పడటంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్డుకు మరమ్మతులు చేయాలి.

–రాజు, హోటల్ యజమాని, కండ్రిక

మాస్టర్ ప్లాన్ ప్రకారం అభివృద్ధి చేయాలి..



ప్రభుత్వం మాస్టర్ ప్లాన్‌లో 80 అడుగుల రోడ్డుకు ప్రతిపాదించింది. ఆ ప్రకారం ప్రస్తుతం ఉన్న 24 అడుగుల రోడ్డును 80 అడుగులు వెడల్పు చేసి అభివృద్ధి చేయాలి. వెంటనే పనులు చేపట్టాలి.

–యర్రగొర్ల తిరుపతమ్మ, కార్పొరేటర్

అప్రోచ్ రోడ్డు మరమ్మతులకు నిధులు మంజూరు



ఆ రోడ్డును 40 టన్నుల సామర్థ్యంతో నిర్మించాం. భారీ వాహనాలు అంతకు మించిన బరువుతో రావడంతో రోడ్డుపై గుంతలు పడుతున్నాయి. ముఖ్యంగా అప్రోచ్ రోడ్డు వద్ద గుంతలు పడి ఉంది. అప్రోచ్ రోడ్డు మరమ్మతుల నిర్వహణకు వీఎంసీ నిధులు మంజూరు చేసింది.

–బి.మాధవ్, ఏఈ, వీఎంసీ

మైనార్టీల ద్రోహి గద్దే

వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్



లబ్బీపేట షాదీఖానా ఎదుట నిరసన తెలుపుతున్న అవినాష్, విష్ణు, మేయర్ భాగ్యలక్ష్మి, నేతలు

లబ్బీపేట(విజయవాడతూర్పు): ముస్లింల చిరకాల ఆకాంక్ష అయిన షాదీఖానా నిర్మాణ పనులను నిలిపివేసి, ఎమ్మెల్యే గద్దే రామ్మోహన్ మైనార్టీలకు తీరని ద్రోహం చేశారని వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్ అన్నారు. పిచ్చయ్యవీధి చివర బందరు కాల్వ ఒడ్డున గత ప్రభుత్వంలో ప్రారంభించిన షాదీఖానా పనులు నేటికీ పూర్తి కాకుండా, మధ్యలో నిలిపివేయడంతో దానిని వైఎస్సార్ సీపీ నేతలు బుధవారం పరిశీలించారు. తొలుత వైవీ రావు ఆస్పత్రి రోడ్డులోని కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్ అలీం కార్యాలయం నుంచి పార్టీ నేతలు, ముస్లిం మైనార్టీలు షాదీఖానా వరకూ ర్యాలీగా వెళ్లారు.

అబద్ధాలు చెబుతూనే ఉన్నారు..

అవినాష్ మాట్లాడుతూ మైనార్టీల చిరకాల కోరిక అయిన షాదీఖానా నిర్మాణాన్ని వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ప్రారంభించామన్నారు. నాడు వైఎస్ జగన్ మైనార్టీల కోసం ఆర్అండ్‌బీ స్థలాన్ని మున్సిపల్ శాఖకు బదిలీ చేశారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది దాటిన నిర్మాణం పూర్తి కాలేదని ఆరోపించారు. తూర్పు ఎమ్మెల్యే గద్దే రామ్మోహన్ మైనార్టీలను మోసం చేశారన్నారు. ఆయన 2014 నుంచి షాదీఖానా విషయంలో అబద్ధాలు చెబుతూనే ఉన్నారని మండిపడ్డారు. వైఎస్సార్ సీపీ సెంట్రల్ ఇన్‌చార్జి మల్లాది విష్ణు, ఎమ్మెల్సీ రుహుల్లా, మేయర్ రాయన భాగ్యలక్ష్మి, రాష్ట్ర ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు పూనూరు గౌతంరెడ్డి, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ ఆసిఫ్, గుంటూరు పార్లమెంటు పరిశీలకులు పోతిన మహేష్, డెప్యూటీ మేయర్లు బెల్లం దుర్గ, అవుతు శ్రీశైలజారెడ్డి, స్థానిక కార్పొరేటర్లు మైనార్టీ నేతలు పాల్గొన్నారు.

లాక్ సూపరింటెండెంట్ల సమస్యల పరిష్కారానికి కృషి



అబ్దుల్ సత్తార్‌ను సత్కరిస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు ప్రసాద్‌బాబు తదితరులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఇరిగేషన్ లాక్ సూపరింటెండెంట్ అసోసియేషన్ నాయకులు ఉద్యోగులకు అండగా ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బి.ప్రసాద్‌బాబు సూచించారు. స్థానిక ముత్యాలంపాడు జీఎస్ రాజు రోడ్డులోని ఇరిగేషన్ లాక్ సూపరింటెండెంట్ అసోసియేషన్ కార్యాలయంలో బుధవారం యూనియన్ విజయవాడ సర్కిల్ అధ్యక్షులు అబ్దుల్ సత్తార్ అధ్యక్షతన సర్కిల్ సమావేశం జరిగింది. కార్యక్రమానికి ప్రసాద్‌బాబు ముఖ్య అతిథిగా పాల్గొని నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిత్యం రైతులకు అందుబాటులో ఉంటూ రైతులకు తాగు, సాగునీరు అందించేందుకు లాక్ సూపరింటెండెంట్‌లు శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నారన్నారు.

డిసెంబర్ 2న డైరీ ఆవిష్కరణ..

రాష్ట్రంలో ఉన్న లాకులు అన్నింటినీ పరిశీలించి నివేదిక తయారు చేసి ఉన్నత అధికారులు, ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామన్నారు. అసోసియేషన్ ప్రారంభించి 77 సంవత్సరాలు పూర్తయ్యిన సందర్భంగా ఈ ఏడాది డిసెంబర్ 2వ తేదీన డైరీ ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. అనంతరం సర్కిల్ అధ్యక్షుడిగా ఎంపికైన అబ్దుల్ సత్తార్‌ను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.నాగేశ్వరరావు, సర్కిల్ ఉపాధ్యక్షుడు ఎస్.దావీదు, కేసీ డివిజన్ సెక్రటరీ కె.ఆనంద కుమార్, డివిజన్ సెక్రటరీ డి.త్రిమూర్తులు, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ ఏ.వెంకట రమణ, ఎస్ శ్రీమన్నారాయణ, సలహాదారులు సీహెచ్ మురళీధర్, ముత్యాలరాణి తదితరులు పాల్గొని మాట్లాడారు.

వావిలాల సేవలు అపూర్వం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీ శాసనసభ్యుడు వావిలాల గోపాలకృష్ణయ్య దేశానికి అందించిన సేవలు అపూర్వమని సర్వోదయ మండలి రాష్ట్ర అధ్యక్షుడు నరహరిశెట్టి శ్రీహరి అన్నారు. వావిలాల జయంతి వేడుకలను సర్వోదయ మండలి కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం నరహరిశెట్టి శ్రీహరి మాట్లాడుతూ దేశంలోనే అత్యుత్తమ విలువలు కలిగిన రాజకీయనేత వావిలాల గోపాలకృష్ణయ్య అన్నారు. స్వాతంత్ర్య సమరయోధునిగా పోరాడటంతో పాటు, స్వాతంత్ర్యం వచ్చాక సమాజంలో మద్యపానానికి వ్యతిరేకంగా ఉద్యమాన్ని నడిపిన మహనీయుడని అన్నారు. అనేక ప్రజా ఉద్యమాలకు సారథ్యం వహించిన వావిలాల గోపాలకృష్ణయ్య ఎందరికో స్ఫూర్తినిచ్చారని కొనియాడారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు అందరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు పలువురు పాల్గొన్నారు.

క్రీడా పోటీల్లో ప్రతిభ

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): బిహార్ రాజధాని పాట్నాలో ఇటీవల జరిగిన 9వ లేజర్ రన్ నేషనల్ చాంపియన్‌షిప్ పోటీలో తమ పాఠశాల విద్యార్థులు పాల్గొని పతకాలు సాధించారని శారద ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యదర్శి కుందా రామనారాయణ చెప్పారు. పోటీల్లో పతకాలు పొందిన విద్యార్థులను గాంధీనగర్‌లోని శారద ఇంగ్లిష్ మీడియం స్కూల్ ఆవరణలో బుధవారం అభినందించారు. రామనారాయణ మాట్లాడుతూ ఈ నెల మొదటి వారంలో పాట్నాలో జరిగిన 9వ లేజర్ రన్ నేషనల్ చాంపియన్‌షిప్ పోటీలో తమ విద్యాసంస్థకు చెందిన విద్యార్థి షేక్ అలియా జాతీయ స్థాయిలో ద్వితీయ స్థానాన్ని, పల్నాడులో జరిగిన 8వ రాష్ట్ర స్థాయి అంతర్ జిల్లాల మోడరన్ పెంటాత్ లాన్ లేజర్ రన్ చాంపియన్ షిప్‌లో రెండో స్థానాన్ని సాధించిందన్నారు. తిరుపతి జిల్లా నాయుడుపేట స్పోర్ట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రీజియన్ స్థాయిలో జరిగిన మోడరన్ పెంటాత్ లాన్ లేజర్ రన్ పోటీల్లో డి.కార్తీక్ రోషన్, డి.నాథన్ మూడో స్థానంలో నిలిచారని చెప్పారు. విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్ మూర్తితో పాటుగా ఉపాధ్యాయులు అభినందించారు.

కూటమి పాలనలో దళితులపై పెరిగిన దాడులు



మాట్లాడుతున్న జడ శ్రావణ్ కుమార్, పక్కన నేతలు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత దళితులపై దాడులు పెరిగాయని దళిత, ప్రజా సంఘాల నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వంలో పదవులు పొందిన దళిత నాయకులు కూడా ఈ దాడులను ఖండించకపోవడం అత్యంత బాధాకరమన్నారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో కైకలూరు నియోజకవర్గం దానగూడెం గ్రామంలో దళితులపై జరిగిన దాడుల ఘటనను ఖండిస్తూ బుధవారం రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. సమావేశంలో ప్రజా సంఘాలు, కుల సంఘాల ప్రతినిధులు పాల్గొని దళితులపై దాడులను ఖండించారు.

ఈ సందర్భంగా ఐఆర్ఎస్ మాజీ అధికారి ఉప్పులేటి దేవి ప్రసాద్, ఎస్సీ కమిషన్ మాజీ చైర్మన్ విక్టర్ బాబు, జై భీం రావు పార్టీ వ్యవస్థాపకుడు జడ శ్రావణ్ కుమార్ తదితరులు మాట్లాడుతూ.. దాడులకు వ్యతిరేకంగా అక్టోబర్ 18న ఏలూరులో లక్ష మందితో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. సభకు చంద్రశేఖర్ ఆజాద్ రావణ్, బీకేసీ పార్టీ జాతీయ నాయకులు తిరుమావళన్ ఆహ్వానిస్తామన్నారు. సమావేశంలో మాలమహానాడు నేతలు తుమ్మల ఫ్రాన్సిస్, బేతాళ శరత్ తదితరులు పాల్గొన్నారు.

భగత్ సింగ్ స్ఫూర్తితో యువత దేశానికి సేవ చేయాలి



విజేతలతో ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి, అధ్యాపకులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): నేటి యువత భగత్‌సింగ్‌ను స్ఫూర్తిగా తీసుకుని దేశానికి సేవ చేయాలని ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కె.భాగ్యలక్ష్మి సూచించారు. స్థానిక మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం భగత్‌సింగ్ జయంతి వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. దేశ స్వాతంత్ర్యం కోసం భగత్‌సింగ్ ప్రాణాలను సైతం తృణప్రాయంగా అర్పించారని కొనియాడారు. భగత్ సింగ్ బ్రిటిష్ పాలనను వ్యతిరేకిస్తూ అనేక ఉద్యమాలలో పాల్గొన్నారన్నారు. 'ఇంకిలాబ్ జిందాబాద్' అనే నినాదాన్ని ఆయన ప్రజల్లో నింపారని.. దేశం కోసం ఆయన 23 ఏళ్ల వయస్సులో ధైర్యంగా ప్రాణత్యాగం చేశారన్నారు. ఆయన త్యాగం భారత యువతకు శాశ్వత ప్రేరణగా నిలిచిందని చెప్పారు. భగత్‌సింగ్ జయంతిని పురస్కరించుకుని కళాశాలలో దిశ ఆధ్వర్యాన వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. తొలుత భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో దిశ వ్యవస్థ నిర్వాహకులు సురేష్, అధ్యాపకులు డి .బాలసుబ్రహ్మణ్య, కె.రమేష్, రాధిక, శాంతకుమారి, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలి



వైద్యపరీక్షలను పరిశీలిస్తున్న కార్పొరేటర్ జానారెడ్డి



64వ డివిజన్‌లో మందులు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ తిరుపతమ్మ

మధురానగర్(విజయవాడసెంట్రల్): దేవీనగర్ పట్టణ ఆరోగ్యకేంద్రం సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి మరింత మెరుగైన వైద్యసేవలు అందించాలని 30వ డివిజన్ కార్పొరేటర్ బీహెచ్ఎస్‌వీ జానారెడ్డి సూచించారు. స్థానిక 30వ డివిజన్ దేవీనగర్ పట్టణ ఆరోగ్యకేంద్రంలో బుధవారం స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఉచిత వైద్య శిబిరం జరిగింది. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల ఆరోగ్య సంరక్షణకు ఏర్పాటు చేసిన ఈ ఉచిత వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మహిళల అవసరాలు, వైద్యసేవలకు అనుగుణంగా అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సెలిస్టియల్ మాట్లాడుతూ.. ఈ కార్యక్రమం వచ్చేనెల 2వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు. అనంతరం మహిళలకు ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, ఆరోగ్యకేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

కండ్రిక యూపీహెచ్‌సీలో..

పాయకాపురం(విజయవాడరూరల్): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ఆధ్వర్యంలో 64వ డివిజన్ కండ్రిక అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ ప్రత్యేక ఆరోగ్య శిబిరం బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ యర్రగొర్ల తిరుపతమ్మ మాట్లాడుతూ.. మహిళల కోసం ప్రత్యేకంగా నిర్వహిస్తున్న వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ సుమ, టీడీపీ నాయకులు కె.రవికుమార్, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు. వైద్యశిబిరంలో 80 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు.

సత్యసాయిబాబా ఉత్సవాలు నిర్వహించడం రాజ్యాంగ విరుద్ధం



లెనిన్ సెంటర్‌లో ప్రదర్శన చేపట్టిన సంగమం, హేతువాద సంఘాల నాయకులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఈ ఏడాది నవంబర్‌లో పుట్టపర్తి సత్యసాయిబాబా శత జయంతి ఉత్సవాలను రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించాలని నిర్ణయించడం రాజ్యాంగ ఉల్లంఘనే అవుతుందని సంగమం, హేతువాద సంఘాల ప్రతినిధులు అన్నారు. విజయవాడ లెనిన్ సెంటర్‌లో సంగమం సంస్థతో పాటు లౌకిక, హేతువాద సంఘాలు బుధవారం నిరసన ప్రదర్శన చేపట్టారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన వ్యక్తం చేశారు. పుట్టపర్తి సత్య సాయిబాబా తానే భగవంతుని అవతారంగా చెప్పుకోవడం, తాను చట్టాలకు అతీతుడనన్నట్లు వ్యవహరించటం, భారత రాజ్యాంగంలో పేర్కొన్న లౌకిక విలువల ప్రకారం, రాజ్యాంగంలోని ఆర్టికల్ 51ఏ(హెచ్) ప్రకారం చట్టవిరుద్ధమైనదని పేర్కొన్నారు. రాజ్యం అందులో భాగమైన ప్రభుత్వం అన్ని మతాలకు చెందిన కార్యక్రమాలకు దూరంగా ఉండాలన్నారు. ప్రజల్లో శాస్త్రీయ దృక్పథాన్ని, ప్రశ్నించే తత్వాన్ని, సంస్కరణ భావాన్ని పెంపొందించాలని హేతువాద సంఘం నాయకులు నార్నె వెంకటప్పయ్య అన్నారు. వివిధ సందర్భాల్లో సత్యసాయిబాబాపై వచ్చిన ఆరోపణలు, వివాదాలను గుర్తు చేశారు. కందుకూరి తాజారావు, దివి కుమార్, జంజనం సత్యనారాయణ, కోడూరు సత్య రంజన్, జీవీ రంగారెడ్డి, జన విజ్ఞాన వేదిక ప్రతినిధులు పాల్గొన్నారు.

నలుగురికి వారం రోజులు జైలు శిక్ష

కృష్ణలంక(విజయవాడతూర్పు): మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న నలుగురికి న్యాయస్థానం వారం రోజుల పాటు జైలు శిక్ష విధించినట్లు నగర పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడిపే చోదకులపై మూడో ట్రాఫిక్ పోలీసులు బుధవారం నిర్వహించిన స్పెషల్ డ్రంక్ అండ్ డ్రైవ్‌లో నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారిని 7వ అడిషనల్ జ్యూడిషియల్ మేజిస్ట్రేట్ కమ్ రైల్వే కోర్టులో ప్రవేశపెట్టగా న్యాయమూర్తి ఆర్.వి.ఎస్ శర్మ ఒక్కొక్కరికి వారం రోజుల పాటు జైలు శిక్ష విధించారని చెప్పారు.

ఘనంగా విశ్వకర్మ జయంతి వేడుకలు



నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే విష్ణు, నాయకులు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): అజిత్‌సింగ్‌నగర్ ఆంధ్రప్రభ కాలనీలోని జనహితసదనంలో మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గం సమన్వయకర్త మల్లాది విష్ణు ఆధ్వర్యాన విశ్వకర్మ జయంతి వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా విష్ణు మాట్లాడుతూ.. సామాజిక వికాసానికి గొప్ప ఆవిష్కరణలను అందించిన భగవాన్ విశ్వకర్మ లోకంలో పూజలు అందుకుంటున్నారన్నారు. విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ ద్వారా చేతివృత్తుల వారికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో చేయూత అందించారని గుర్తుకు చేశారు. 130 కులాలకు గాను 56 కార్పొరేషన్ ఏర్పాటు చేసి విశ్వబ్రాహ్మణులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి వారి అభివృద్ధికి వైఎస్ జగన్ తోడ్పడ్డారని చెప్పారు. కార్పొరేటర్లు శర్వాణీ మూర్తి, కుక్కల అనిత, నాయకులు రాజా రమేష్, అలంపూర్ విజయ్, గుండే సుందర్ పాల్, నాగేంద్ర, సెంట్రల్ నియోజకవర్గ చేతివృత్తుల విభాగం అధ్యక్షుడు జువ్వాది సుధీర్, తోపుల వరలక్ష్మి, మాత మహేష్, నాయుడు, శ్యాం, స్వర్ణకారులు తదితరులు పాల్గొన్నారు.

విశ్వకర్మకు సీపీ నివాళి



విశ్వకర్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీ ఎస్వీ రాజశేఖరబాబు

లబ్బీపేట(విజయవాడతూర్పు): ప్రపంచ సృష్టిలో మొట్టమొదటి వాస్తు శిల్పి శ్రీ విశ్వకర్మ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పోలీస్ కమిషనర్ రాజశేఖరబాబు ఘన నివాళులర్పించారు. సీపీ మాట్లాడుతూ.. విశ్వకర్మ భగవానుడి శక్తి, సృష్టిశీలత, క్రమశిక్షణ అందరికీ ఆదర్శం కావాలని ఆకాంక్షించారు. పోలీస్ అధికారులు, కార్యాలయ సిబ్బంది, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వీఎంసీలో విశ్వకర్మ జయంతి

పటమట(విజయవాడతూర్పు): వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్ వద్ద విశ్వకర్మ జయంతిని బుధవారం నిర్వహించారు. వీఎంసీ మేనేజర్ ప్రభావతి, అకౌంట్స్ అధికారి బి.సత్యనారాయణమూర్తి విశ్వకర్మకు నివాళులర్పించారు.

సిద్ధార్థలో రేపు ఇంటర్నల్ హ్యాకథాన్‌-2025



మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): విద్యార్థుల్లో ఉన్న ప్రతిభకు మరింతగా పదును పెట్టడానికి శుక్రవారం తమ కళాశాలలో ఇంటర్నల్ హ్యాకథాన్‌-2025ను నిర్వహిస్తున్నామని పీబీ సిద్ధార్థ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రమేష్ చెప్పారు. హ్యాకథాన్‌-2025కు సంబంధించిన పోస్టర్‌ను కళాశాల ఆవరణలో బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న స్మార్ట్ ఇండియా హ్యాకథాన్‌-2025లో భాగంగా తమ కళాశాలలో ఈ పోటీలను నిర్వహిస్తున్నామని చెప్పారు. కళాశాల డేటా సైన్స్ విభాగాధిపతి ఉదయశ్రీ మాట్లాడుతూ ఆరుగురు విద్యార్థులు కలిసి ఒక టీమ్‌గా ఏర్పడి ఈ పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. అలాంటి 30 టీమ్‌లు హ్యాకథాన్‌లో పాల్గొంటాయని తెలిపారు. పోటీల్లో ప్రతిభ చూపిన టీమ్ రాష్ట్ర స్థాయిలో జరిగే హ్యాకథాన్‌లో పాల్గొంటాయన్నారు.